మెడికల్ సీట్లు వద్దనడం సిగ్గుచేటు



మెడికల్ సీట్లు తీసుకుని చెట్ల కింద షెడ్ల కింద క్లాసులు చెప్పాలా..పాఠాలు మీరు చెబుతారా..జగన్ అంటూ రాష్ట్ర మంత్రి సత్యకుమార్ జగన్‌ను విమర్శించం సిగ్గుచేటు. జగన్ ప్రభుత్వంలో ప్రతి పార్లమెంటు పరిధిలో వైద్య కళాశాలను మంజూరు చేశారు. మెడికల్ కౌన్సిల్‌కు కూటమి ప్రభుత్వం అదనపు మెడికల్ సీట్లను వద్దనడం మరీ సిగ్గుచేటు. మెడికల్ విద్యార్థుల భవిష్యత్తుకు గొడ్డలిపెట్టు. ఇప్పటికే మెడికల్ విద్య అందని ద్రాక్షలా మారింది. దీనికి తోడు ఇస్తామన్న మెడికల్ సీట్లను వద్దనడం దారుణం. వైద్య విద్యను మరింత దూరం చేయడమే అవుతుంది. దీనికి తోడు మంత్రి మాటలు రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతను బయటపెట్టాయి.

-స్వాతి, కడప క్రాస్, కురబలకోట మండలం



మంత్రి మాటలకు జనం నవ్వుకుంటున్నారు



విద్యలో అత్యధిక డిమాండు ఖర్చుతో కూడుకున్నవి మెడికల్ సీట్లే. ఇలాంటి సీట్లను ఎన్ఎంసీ ఇస్తామంటే సంతోషించాల్సిందిపోయి రాష్ట్ర కూటమి ప్రభుత్వం వద్దనడంతో జనం నవ్వుకుంటున్నారు. ఎంతో రాజకీయ అనుభవం ఉందన్న చంద్రబాబు వచ్చే సీట్లను వద్దనడం విడ్డూరంగా ఉంది. ఇవి మంత్రి మాట్లాడాల్సిన మాటలేనా..చేతగానితనం బయటపడింది. దీనికి తోడు పాఠాలు మీరు చెబుతారా..జగన్ అంటూ రాష్ట్ర మంత్రి సత్యకుమార్ విమర్శించడం మరీ విడ్డూరంగా ఉంది. ప్రభుత్వ చేతగాని తనాన్ని ఒప్పుకున్నట్లే. సీట్లు వద్దనే ప్రభుత్వ నిర్ణయాన్ని విరమించుకోవాలి.

-ఈశ్వర్‌రెడ్డి, పిచ్చలవాండ్లపల్లె, కురబలకోట

క్లుప్తంగా

18న సర్వసభ్య సమావేశం

వాల్మీకిపురం: ఈ నెల 18వ తేది బుధవారం ఉదయం 10:30గంటలకు ఎంపీపీ అరుణమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మనోహర రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

ట్రై సైకిల్ వితరణ



ట్రై సైకిల్ అందజేసిన ఫౌండేషన్ సభ్యులు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని తుమ్మరకుంట పంచాయతీ ఎగవ బండమీదపల్లికి చెందిన బాణాల కదిరప్ప ఏడాది క్రితం ప్రమాదవశాత్తు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందాడు. సదరు వ్యక్తికి నడుం భాగంలో సత్తువ లేకపోవడంతో మంచానికే పరిమితం అయ్యాడు. విషయం తెలుసుకున్న తుమ్మరకుంటకు చెందిన యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ నిరుపేదకు బాసటగా నిలిచారు. ఫౌండేషన్ అధ్యక్షుడు రాజశేఖర్‌తో పాటు సభ్యులు శివారెడ్డి, చందు, విశ్వనాథ్, మురళి, చిన్ని, అనిల్ తదితరులు ఆదివారం కదిరప్పకు ట్రై సైకిల్ అందజేసి మానవత్వం చాటుకున్నారు.

మహిళకు తీవ్ర గాయాలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని రంగసముద్రంకు చెందిన బావక్క (55) అనే మహిళ ఆదివారం ప్రమాదవశాత్తు మెట్లపై నుంచి జారి తీవ్ర గాయాల పాలైంది. బావక్క మొక్కజొన్న కంకులు ఆరబెట్టేందుకు ఇంటి మిద్దెపైకి ఎక్కే ప్రయత్నంలో జారి పడింది. కుటుంబ సభ్యులు సదరు మహిళకు బి.కొత్తకోట సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

హెచ్ఐవీపై నివారణపై అవగాహన



హెచ్ఐవీ నివారణపై అవగాహన కల్పిస్తున్న రాజమ్మ

పీలేరు : హెచ్ఐవీ, సుఖ వ్యాధుల నివారణపై అవగాహన అవసరమని కోర్ సంస్థ ప్రతినిధి రాజమ్మ అన్నారు. ఆదివారం స్థానిక చిత్తూరు రోడ్డు మార్గంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు న్యాకో నేతృత్వంలో హెచ్ఐవీ /ఎయిడ్స్, టీబీ, సుఖ వ్యాధులపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎయిడ్స్ ఎలా వ్యాప్తి చెందుతుంది, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి. కరుణ, స్టాఫ్ నర్స్ కృష్ణప్రమీల, కోర్ సిబ్బంది షర్మిల, విజయలక్ష్మి పాల్గొన్నారు.

వేలంలో రూ.1,50,027 పలికిన లడ్డూ ధర



వినాయకుడిని నిమజ్జనానికి ఊరేగిస్తున్న భక్తులు

వాల్మీకిపురం: మండలంలోని అయ్యవారిపల్లిలో వినాయకుడి చవితి ఉత్సవాల్లో భాగంగా వినాయకుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం గ్రామంలో వినాయకుడి విగ్రహం నిమజ్జనం సందర్భంగా స్వామివారి దగ్గర పెట్టిన లడ్డూ ప్రసాదాన్ని వేలం పాట నిర్వహించారు. గ్రామానికి చెందిన గంగసాని నరసింహరెడ్డి కుటుంబం వేలం పాటల్లో పాల్గొని లడ్డూను రూ.1,50,027 పాడి లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. అలాగే పట్టణంలోని పాతతేరువీధిలో వినాయకుడి నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. పట్టణ పురవీధుల్లో ఊరేగించి, నిమజ్జనం చేశారు.

వాహనాలు ధ్వంసం

రాజంపేట : పట్టణంలోని బోయపాలెంలో పలువురి వాహనాలను ధ్వంసంకు గురైయ్యాయి. శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కారు, లగేజీ ఆటోల అద్దాలను పగులగొట్టారు. వాహనాల యజమానులు ఆందోళనకు గురయ్యారు. తమ వాహనాలను ఎందుకు ధ్వంసం చేశారో తెలియడం లేదంటున్నారు. రాత్రి పూట పోలీసుల బీట్ లేనట్లుగా ఉందని ఆరోపణలు వెలువడుతున్నాయి. గతంలోనూ సాయినగర్ తదితర ప్రాంతాల్లో ఆరుబయట ఉన్న స్కూటర్లను కూడా కాల్చివేసిన సంఘటనలు ఉన్నాయి.

సమాజసేవ మహాభాగ్యం

రాజంపేట : సమాజసేవ మహాభాగ్యమని లవ్ అండ్ కేర్ ట్రస్ట్ అధ్యక్షుడు కార్తిక్‌రెడ్డి, కోశాధికారి మునిచంద్ర అన్నారు. ఆదివారం రాజంపేట వైఎస్సార్ సర్కిల్‌లో పేదలకు అన్నదానం కార్యక్రమంను నిర్వహించారు.

అభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర కీలకం

- ఘనంగా నేషనల్ ఇంజినీర్స్ డే వేడుకలు
- విశ్వేశ్వరయ్య విగ్రహానికి నివాళులర్పించిన ఇంజినీరు



మదనపల్లె: ఇంజనీర్స్‌డే సభలో మాట్లాడుతున్న హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ సీహెచ్ రాజగోపాల్



కురబలకోట: మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అమరనాథరెడ్డి తదితరులు

మదనపల్లె : సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆధునిక యుగంలో ప్రతి రంగంలోనూ ఇంజినీర్ల పాత్ర కీలకమైందని హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ సీహెచ్.రాజగోపాల్ అన్నారు. స్థానిక పంచాయతీ రాజ్ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఇంజినీర్స్ జేఏసీ తరపున నేషనల్ ఇంజినీరింగ్ డేను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మొదట సర్.మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విశ్రాంత ఇంజినీర్లను ఘనంగా సన్మానించారు. ప్రతిభ కనపరుస్తున్న 22 ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ల వారికి అవార్డులు అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ సీహెచ్.రాజగోపాల్ మాట్లాడుతూ... నూతన ఆవిష్కరణల ద్వారా సమాజంలో మానవజీవితానికి కీలకమైన మార్పులు తెస్తూ, అభివృద్ధి బాటలో దేశాలను నడిపించడంలో ఇంజనీర్లు ముఖ్యపాత్ర పోషిస్తున్నారన్నారు. సర్.మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలను స్మరించుకుంటూ, ఆయన చేసిన కృషికి గౌరవంగా ఆయన జయంతి అయిన సెప్టెంబర్ 15న జాతీయ ఇంజనీర్ల దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ఇంజనీర్ల ప్రత్యేక సామర్థ్యాలను గుర్తించడంతో పాటు వారిలో మరింత విశ్వాసాన్ని నింపేందుకు జాతీయ ఇంజనీర్ల దినోత్సవం దోహదపడుతుందన్నారు. భారతదేశ అభివృద్ధికి గణనీయమైన కృషి చేసి, మార్గదర్శక ఇంజనీర్‌గా గుర్తింపు పొందిన సర్.మోక్షగుండం విశ్వేశ్వరయ్య యువ ఇంజనీర్లకు స్ఫూర్తి అన్నారు. దేశంలో ఎన్నో ప్రతిష్టాత్మకమైన కట్టడాల నిర్మాణంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య పాత్ర ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా సంక్లిష్టమైన సమస్యలను పరిష్కరించడంలో, సాంకేతికతను అభివృద్ధి చేయడంలో, ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరచడంలో ఇంజనీర్ల కృషి మరువలేనిదన్నారు. నేటి ఆధునిక యుగంలో రోజుకో కొత్త ఆవిష్కరణలు బయటకు వస్తున్నాయంటే అందులో ఇంజనీర్ల పాత్ర ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో యువనాయకులు జునైద్ అక్బరీ, ఇంజనీరింగ్ జేఏసీ కన్వీనర్ బాబూరాజేంద్రప్రసాద్, రిటైర్డ్ సీఈలు హరినాథరెడ్డి, అమరనాథరెడ్డి, హెచ్ఎన్ఎస్ఎస్ ఈఈ గడ్డం సురేష్‌బాబు, క్వాలిటీకంట్రోల్ ఈఈ గోపాల్, మైనర్ ఇరిగేషన్ ఏఈ సతీష్, పెద్దమండ్యం ఏఈ శ్రీనివాసులురెడ్డి, డీఈ చోప్లానాయక్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, వార్డు సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ ఖ్యాతిని నలుదిశలా చాటిన మోక్షగుండం

కురబలకోట: ఇంజినీరింగ్ గొప్పతనాన్ని నలుదిశలా చాటిన గొప్ప ఇంజనీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మాజీ చీఫ్ ఇంజినీరు ఎ.అమరనాథరెడ్డి అన్నారు. ఆదివారం అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఇంజినీర్స్‌డేని పురస్కరించుకుని జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ దేశంలో ఇంజనీరింగ్‌కు ఖ్యాతి తెచ్చిపెట్టింది మోక్షగుండమేనన్నారు. భారతజాతి గర్వించదగ్గ గొప్ప ఇంజనీరుగా పేరుగడించారన్నారు. అంతేకాదు ఇంజనీరుగా దేశ ఖ్యాతిని నలుదిశలా చాటారన్నారు. ప్రపంచ ప్రఖ్యాత నిర్మాణాలను ఆవిష్కరించారన్నారు. ఆయన మార్గదర్శకత్వంలో జరుపుకున్న నిర్మాణాలు నేటికి చెక్కుచెదరలేదన్నారు. ఇంజనీర్లు ఆయన సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

మదనపల్లె : వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవం కార్యక్రమాలలో ప్రభుత్వం రూపొందించిన నియమ నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ... ఇటీవల కొన్ని గ్రామాలలో జరిగిన వినాయక నిమజ్జనాలలో కొద్దిపాటి ఘర్షణలు చెలరేగి వివాదాలు ఏర్పడుతున్నాయన్నారు. అలాంటి పరిస్థితులను నివారించేందుకు వినాయక నిమజ్జన కార్యక్రమాలలో పాటించాల్సిన నియమాలను ఉత్సవ కమిటీ సభ్యులు కచ్చితంగా పాటించాలన్నారు. పాటించని ఉత్సవ కమిటీ సభ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలోని వినాయక నిమజ్జన కార్యక్రమాల్లో డీజే వాయిద్యాలకు అనుమతి లేదన్నారు. డీజే నిర్వహిస్తే వెంటనే సదరు వాహనాన్ని సీజ్ చేసి, డ్రైవర్ పై కేసు నమోదు చేస్తామన్నారు. ఊరేగింపు సందర్భంగా ఉద్దేశపూర్వకంగా ఇతరులను నొప్పించేలా,రెచ్చగొట్టే విధంగా పాటలు పెడితే చర్యలు తప్పవన్నారు. మద్యం సేవించి వినాయక విగ్రహాల ఎదుట డాన్సులు చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే, సదరు వ్యక్తులపై బైండోవర్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ విషయాలను గమనించి ఉత్సవ కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉత్సవ కార్యక్రమాలను నిర్వహించుకోవాలన్నారు.

ఆదర్శప్రాయుడు అంబేడ్కర్



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన బ్రిడ్జ్ సొసైటీ సభ్యులు

- జెడ్పీహైస్కూల్‌లో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

మదనపల్లె : దేశంలో బడుగు, బలహీనవర్గాలు అభివృద్ధి చెందాలని, ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగాన్ని అందించి రాజ్యాంగ రూపకర్తగా పేరుమోసిన డాక్టర్ అంబేడ్కర్ ఆదర్శప్రాయుడని విశ్రాంత ఐజీ ఇ.రాధాకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని జెడ్పీహైస్కూల్ ఆవరణలో బ్రిడ్జ్ ఇండియా సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్.బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. బ్రిడ్జ్ ఇండియా సొసైటీ ప్రధాన కార్యదర్శి వి.మునివెంకటప్ప అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథి రాధాకృష్ణ మాట్లాడుతూ... అంబేడ్కర్ త్యాగంతో ప్రయోజనం పొందుతున్న ఎస్సీ,ఎస్టీ ఉద్యోగులు, రాజకీయప్రముఖులు, ఆర్థికంగా స్థితిమంతులైన వాళ్లు పే బ్యాక్ టూ సొసైటీ అన్న అంబేడ్కర్ ఆజ్ఞను అర్థం చేసుకుని, ఆయన సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లేందుకు తోడ్పాటును అందించాలన్నారు. పే బ్యాక్ టు ద సొసైటీ కార్యక్రమంలో అందరినీ భాగస్వాములను చేసేందుకే బ్రిడ్జ్ ఇండియా సొసైటీ ఏర్పాటుచేశామన్నారు. ఎస్సీ,ఎస్టీలకు విద్య, ఉద్యోగం, ఆరోగ్యం తదితర విషయాలతో పాటు దళిత నాయకత్వ శిక్షణకు బ్రిడ్జ్ ఇండియా సొసైటీ పలు కార్యక్రమాలు చేపడుతామన్నారు. బ్రిడ్జ్ ఇండియా సొసైటీకి అంబేద్కరిస్టు సంఘాలు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో రిటైర్డ్ తహసీల్దార్ నరసింహులు, రాజేంద్ర, కే.వి.రమణ, ఎ.వి.రమణ, మాలమహానాడు యమలాసుదర్శనం, వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం.శివప్రసాద్, ఎమ్మార్పీఎస్ నరేంద్రబాబు, పోర్డ్ లలితమ్మ, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం.సుబ్బారెడ్డి, రెడ్డెన్నశెట్టి, దళితసంఘాల నాయకులు చిన్నప్ప, చిట్టిబాబు, చెన్నకేశవులు, చందు, జయకుమార్, నారాయణ, కే.వి.రత్నం, సొన్నికంటిరెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీవారి పవిత్రోత్సవాలు



స్వామి వారికి చక్రస్నానం గావిస్తున్న వేదపండితులు



స్వామి వారి ఊరేగింపు

తంబళ్లపల్లె: మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీవారి పవిత్రోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. స్వామివారి చక్ర స్నాన కార్యక్రమం భక్తులకు కనువిందు చేసింది. టీటీడీ ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు, ఉప ప్రధాన అర్చకులు కృష్ణ ప్రసాద్ బట్టార్, ఆలయ అర్చకులు రమేష్ ఆచార్యులు సాంప్రదాయ బద్ధంగా ఆగమ శాస్త్ర ప్రకారం చతుష్టామార్గమం పవిత్ర విసర్జన, తపన తిరుమంజనం కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు.భక్తులను కనువిందుగొలిపే విధంగా స్వామి వారి చక్ర స్నాన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం వీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఇన్‌స్పెక్టర్ దుష్యంత్ కుమార్, నగేష్, రవి పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



గోరంట్లపల్లెలో నిర్వహించిన సంజీవిని గ్రామీణ స్త్రీ ఆరోగ్య పరిరక్షణ వైద్యశిబిరం

కేవీపల్లె : మండలంలోని గోరంట్లపల్లెలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆదివారం అరబిందో ఫార్మా ఫౌండేషన్ సౌజన్యంతో శ్రీనివాస ఛారిటుబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ×సంజీవిని గ్రామీణ స్త్రీ ఆరోగ్య పరిరక్షణ ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ శశికుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ వైద్యశిబిరంలో 52 మంది మహిళలకు పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అలాగే సాధారణ జబ్బులకు సంబంధించి 215 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ట్రస్టీ డాక్టర్ పి.వి. బ్రహ్మరెడ్డి, ట్రస్ట్ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ జిలాని, డాక్టర్ షమీమ్, వలంటీర్లు రామాంజనేయులు, షబ్బీర్, బాషా, తిరుపతి మెడిగో హాస్పిటల్ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

రామాపురం : మండలంలోని సుద్దమళ్ల పంచాయతీ దూదేకులపల్లె సమీపంలో పొదల్లో జూదం ఆడుతున్నట్లు ముందస్తు సమాచారం మేరకు మండల ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి దాడులు నిర్వహించారు. దాడుల్లో ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.10,670లు నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

ప్రభుత్వం హామీని నిలబెట్టుకోవాలి

- వాల్మీకి జయంతిని సెలవుదినంగా ప్రకటించాలని డిమాండ్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వీఆర్ఎస్ఎస్ నాయకులు

మదనపల్లె : వాల్మీకులను ఎస్టీ జాబితాలో పునరుద్ధరణ చేస్తామని బోయ,వాల్మీకులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలుపుకోవాలని వాల్మీకి రిజర్వేషన్ సాధనసమితి(వీఆర్ఎస్ఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు పొదల నరసింహులు డిమాండ్ చేశారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో పొదల నరసింహులు మాట్లాడుతూ.. వాల్మీకి మహర్షి జయంతిని రాష్ట్రప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించి అధికారికంగా వేడుకలు నిర్వహించాలని, అక్టోబర్ 17న జరగనున్న వాల్మీకి జయంతిని సెలవుదినంగా ప్రకటించి, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలన్నారు. దేశవ్యాప్తంగా వాల్మీకులు వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా జరుపుకోవాలన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వాల్మీకులకు ఎస్టీ పునరుద్ధరణ చేస్తామని మాట ఇచ్చిందని, నిలుపుకునే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలని వీఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్రీయ వాల్మీకి ధర్మసమాజ్ రాష్ట్ర అధ్యక్షులు మేకలవిజయకుమార్, టేకుపల్లిశ్రీనివాసులు, కోటారమణ, చిన్నంవెంకటరమణ, నరసింహులు, చంద్రాయుడు, గౌరమ్మ, కమలాకర, మేకలశివ, సూరి, రమణ, చిన్నంశ్రీరాములు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆప్కాస్ సిబ్బంది నిరసన



సర్వజన బోధన ఆసుపత్రి వద్ద నిరసన తెలుపుతున్న ఆప్కాస్ ఔట్ సోర్సింగ్ సిబ్బంది

మదనపల్లె : ప్రభుత్వ సర్వజన బోధన ఆసుపత్రిలో ఆదివారం ఆప్కాస్ ఔట్ సోర్సింగ్ సిబ్బంది జీతాలు చెల్లించాలని ఆస్పత్రి అత్యవసర విభాగం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సాంబశివ మాట్లాడుతూ... ఆసుపత్రి సూపరింటెండెంట్ నిర్లక్ష్యం కారణంగానే ఆప్కాస్ ఔట్ సోర్సింగ్ సిబ్బందికి జీతాలు అందలేదన్నారు.దీనికి పూర్తి బాధ్యత సూపరింటెండెంట్ వహించాలని డిమాండ్ చేశారు. 13 రోజులుగా ఆసుపత్రి వద్ద నిరసనలు తెలియజేస్తున్నా సూపరింటెండెంట్ ఇతర అధికారులు ఎందుకు పట్టించుకోలేదో సమాధానం చెప్పాలన్నారు. కొంత మందికి 13 నెలలు,మరి కొంతమందికి 7నెలలుగా వేతనాలు రాకుంటే సూపరింటెండెంట్‌కు బాధ్యత లేదా?అని ప్రశ్నించారు.తక్షణమే వేతనాలు చెల్లించడానికి సంబంధిత అధికారులు చొరవ చూపాలని లేని పక్షంలో సిబ్బంది విధులు బహిష్కరిస్తారన్నారు. ఏఐటీయూసీ నాయకులు మురళి, వెంకటరమణ, జ్ఞాన శేఖర్, పెద్దన్న, జమీల్, అప్సానా, తులసి, మృదుల, రేవతి తదితరులు పాల్గొన్నారు.

దేవుడి భూములకే శఠగోపం



కలికిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం

కలికిరి: కలికిరి పట్టణంలో వెలసిన అతి పురాతన ఆలయం శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం. ప్రతి ఏటా ఆలయానికి సంబంధించి వార్షిక ఉత్సవాలు తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా జరుగుతాయి. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కులు తీర్చుకుంటుంటారు. ఆలయానికి ప్రాచీన వైభవం ఉండటంతో పురాతన కాలంలో రెవెన్యూ రికార్డులు ఎ-రిజిస్టరు మేరకు కలికిరి రెవెన్యూ గ్రామ దాఖలాలో సర్వే నంబరు 930లో 6 ఎకరాల 16 సెంట్ల విస్తీర్ణం శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పేరుతో నమోదైంది. ఈ మేరకు రెవెన్యూ అధికారులు ఐజీఆర్ఎస్ ప్రొహిబిటెడ్ జాబితాలో సైతం చేర్చారు. అయితే ఇటీవల జరిగిన భూ రీ సర్వే అనంతరం తాజాగా వచ్చిన ఆన్‌లైన్ 1బీ లో ఆలయం పేరున కాకుండా ప్రైవేటు వ్యక్తి పేరు దర్శనమిస్తుండటంతో గమనించిన భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కలికిరి గ్రామ పరిధిలో 1బి ఖాతా నంబర్ 269 మేరకు సర్వే నంబర్ 930లో 5 ఎకరాలు 95 సెంట్ల విస్తీర్ణం ఎస్.చాంద్ బీ పేరున పట్టా భూమిగా, వారసత్వంగా సంక్రమించినట్లు నమోదై ఉంది. ఆలయ భూములను దర్జాగా వేరొకరి పేరున మార్పు చేసి ఉండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆలయానికి సంబంధించిన మరికొన్ని ఆస్తులు పరాధీనమయ్యాయని, దేవదాయశాఖ, రెవెన్యూ అధికారులు ఆలయానికి సంబంధించిన పూర్తి ఆస్తులపై సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని భక్తులు అంటున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.

రికార్డులు ఎలా తారుమారు చేస్తున్నారు



పురాతన చరిత్ర కలిగిన ఆలయ భూములకు సంబంధించిన రికార్డులు ఎలా మార్పు చేస్తారో అధికారులకు ఎరుక. అదీ ఆలయం భూముల ను పట్టా భూములుగా చూపడం, ప్రైవేటు వ్యక్తుల పేరుపై మార్పు చేయడం చూస్తే ప్రణాళిక ప్రకారం జరిగినట్లు అనుమానం కలుగుతోంది. దీనిపై విచారణ చేపట్టి అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలి.

- డి. ప్రభాకర్ గుప్త, కలికిరి

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువుకు నివాళులర్పిస్తున్న పూర్వ విద్యార్థులు

పీలేరు రూరల్ : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1958, 1959, 1960 బ్యాచ్‌కు చెందిన ఎస్ఎస్ఎల్‌సీ విద్యార్థులు ఆదివారం సమావేశం నిర్వహించారు. తమకు ఆది గురువు అయిన దివంగత నారే వెంకటరమణారెడ్డి చిత్రపటానికి పూల మాలలతో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా విశ్రాంతి విద్యాశాఖాధికారి ఎ. రెడ్డిసుబ్రమణ్యం మాట్లాడుతూ 2022 ఏప్రిల్ 23వ తేదీన 35 మందితో సమావేశం నిర్వహించి తాము చదివిన పాఠశాలకు రూ. 4.50 లక్షలతో కార్యాలయ ఫర్నీచర్, సోలార్ లైట్లు, జిరాక్స్ మిషన్, ప్రింటర్ అందజేసినట్లు తెలిపారు. వారు కోల్పోయిన గురువులు, సహచర మిత్రుల ఆత్మశాంతికి ప్రార్థించారు. కార్యక్రమంలో విశ్రాంతి విద్యాశాఖాధికారి ఎ. రెడ్డిసుబ్రమణ్యం, పూర్వవిద్యార్థులు రాఘవరెడ్డి, నారాయణ, ఎం. బలరామకృష్ణ, మీసాల రాజారెడ్డి, వి. రంగారెడ్డి, రెడ్డెప్పశెట్టి, డాక్టర్ వెంకటస్వామిరెడ్డి పాల్గొన్నారు.

కోలాహలంగా వినాయక నిమజ్జనం





కేవీపల్లె: గణేష్ విగ్రహాన్ని ఊరేగింపు చేస్తున్న భక్తులు, కలకడ: నిమజ్జనానికి తరలివెళుతున్న వినాయకుడు

కేవీపల్లె : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా కేవీపల్లె తోటిదళితవాడలో గణేష్ నిమజ్జనం కోలాహలంగా నిర్వహించారు. ఏడు రోజుల పాటు పూజలు అందుకున్న గణనాథున్ని ప్రత్యేకంగా ట్రాక్టర్‌లో అలంకరించి ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా కోలాటాలు, చెక్కభజనలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం గ్రామ సమీపంలో చెరువులో వినాయకున్ని నిమజ్జనం చేశారు.

కలకడలో..

కలకడ : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పలు గ్రామాల్లో నెలకొల్పిన వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. విగ్రహాలను గ్రామ పురవీధులలో ఊరేగించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. యువత, మహిళలు రంగులు చల్లుకుని కోలాహలంగా నిమజ్జనోత్సవంలో పాల్గొన్నారు.